క్లుప్తంగా

ఉక్కు ఆస్పత్రికి వాటర్ ప్యూరిఫైయర్ అందజేత



ఆస్పత్రి వైద్యులకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేస్తున్న ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1 సీనియర్ మేనేజర్ కేశనకుర్తి ప్రసాద్ ఉక్కు జనరల్ ఆస్పత్రికి వాటర్ ప్యూరిఫైయర్ అందజేశారు. ప్రసాద్ తల్లిదండ్రులకు ఆస్పత్రి అందించిన సేవలకు కృతజ్ఞతగా, రోగుల సదుపాయం కోసం దీనిని బహూకరించారు. ఆస్పత్రి విభాగాధిపతి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్‌కు డాక్టర్ సారంగి, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ గిరిధర్, అడ్మినిస్ట్రేషన్ సీనియర్ మేనేజర్ క్రాంతి కుమార్ సమక్షంలో ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ కమిటీ సభ్యులు ముసినాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక చిన్నారికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డుతో వేదాన్షిక

గాజువాక : గాజువాకకు చెందిన మూడున్నరేళ్ల సమ్మంగి వెంకట వేదాన్షిక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. 'రోప్ నిచ్చెనను అధిరోహించడానికి, దిగడానికి అత్యంత వేగవంతమైన చిన్నారి' టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని వరల్డ్ బుక్ రికార్డ్స్ గతనెల 10న నిర్ధారించింది. వేదాన్షిక స్థానిక ఓక్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రీ ప్రైమరీ క్లాస్ చదువుతోంది.

రోడ్ మార్జిన్ ఆక్రమణపై ఫిర్యాదు



రోడ్ మార్జిన్‌ను ఆక్రమించిన దృశ్యం

గాజువాక : పాతగాజువాక జంక్షన్‌కు సమీపంలోని ఒక వాణిజ్య సముదాయం యాజమాన్యం రోడ్ మార్జిన్‌ను ఆక్రమించిందని 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ జీవీఎంసీ కమిషనర్, నగర పోలీస్ కమిషనర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. తమ పరిధిని దాటి రోడ్డుపైకి వచ్చేసిన షాపింగ్ కాంప్లెక్స్ యాజమాన్యం ఆ ప్రదేశంలోకి ఎవరూ ప్రవేశించకుండా రోడ్డుకు అడ్డంగా తాళ్లతో కట్టి, నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఈ చర్యవల్ల సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. విద్యా సంస్థలన్నీ ఇక్కడే ఉండటంవల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఆక్రమణను వెంటనే తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టంపజేసి కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

ఆకర్షణీయం..ఆహ్లాదకరం

- రూ.1.2 కోట్లతో లంకెలపాలెం కోనేరు అభివృద్ధి
- కొండవాలు నుంచి వర్షపు నీరు ఒడిసిపట్టేలా చర్యలు
- చిన్నారుల కోసం ప్లే ఏరియా
- పెద్దలకు వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు

కోనేటి గట్టున చల్లని గాలిని ఆస్వాదిస్తూ.. ప్రశాంత వాతావరణంలో విహరిస్తే ఆ ఆనందమే వేరు. అక్కడే చిన్నారుల కోసం క్రీడా పరికరాలు.. ఆరోగ్యాభిలాషుల కోసం వాకింగ్ ట్రాక్.. ఓపెన్ జిమ్ కూడా ఉంటే అందమైన సాయంత్రాలు ఆహ్లాదకర వాతావరణంలో గడిపేయవచ్చు. అందుకు అనువైన వేదికగా రూపుదిద్దుకుంది లంకెలపాలెంలోని వాటర్‌ఫ్రంట్. రూ.1.20 కోట్లతో అభివృద్ధి చేసిన కోనేరు పరిసరాలు సందర్శకులకు మధురానుభూతిని పంచుతున్నాయి.



వాటర్ ఫ్రంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, పిల్లల క్రీడా పరికరాలు



నీటి నిల్వల కోసం సిద్ధం చేసిన కోనేరు, పక్కనే వాకింగ్ ట్రాక్



జాతీయ రహదారిని ఆనుకుని లంకెలపాలెం వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ఫ్రంట్

అగనంపూడి: లంకెలపాలెం వాటర్‌ఫ్రంట్ అందంగా ముస్తాబై సందర్శకులకు స్వాగతం పలుకుతోంది. కొండవాలు నుంచి జాలువారే ప్రతీ నీటిబొట్టును సంరక్షిస్తూ పర్యావరణ హితంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాంతం అటు ప్రకృతి ప్రియులను, ఇటు సందర్శకులనూ ఆకట్టుకుంటోంది. చెరువుల అభివృద్ధి పనుల్లో భాగంగా 79వ వార్డు లంకెలపాలెం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కోనేరును అభివృద్ధి చేశారు. నగర వచ్ఛదనం, సుందరీకరణ విభాగం ఆధ్వర్యంలో అమృత్ పథకంలో రూ.కోటి ఇరవై లక్షలతో సుందరీకరణ పనులు చేపట్టారు. కోనేటి గట్టును చదును చేయడం, కోనేరు గర్భంలో మట్టిని తొలగించడం,

గట్టు కోతకు గురవ్వకుండా అంతర్భాగంలో రాళ్లు పేర్చడం, ఆవరణ చుట్టూ ప్రహరీ, వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ఓపెన్ జిమ్ పరికరాల ఏర్పాటు, పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన క్రీడా పరికరాలు అమర్చారు. జాతీయ రహదారికి ఆవలవైపునున్న కొండవాలు ప్రాంతం నుంచి జాలువారే వర్షపునీటి ప్రవాహాన్ని ఒడిసిపట్టి, చెరువులోకి మళ్లించే ఏర్పాటు చేశారు.

ఎకో వైజాగ్ లక్ష్యం

ఎకో వైజాగ్ సాధనే లక్ష్యంగా లంకెలపాలెం వాటర్ ఫ్రంట్ నిర్మాణం పూర్తి చేసి సందర్శకుల కోసం సిద్ధం చేశారు. వాకింగ్ ట్రాక్‌కు ఒకవైపు కోనేరు మరోవైపు పచ్చని పచ్చిక బయళ్లతో ఆహ్లాదకర వాతావరణం రా రమ్మని స్వాగతిస్తోంది. ముఖద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్ వర్షాలకు పాడవకుండా ఉండేలా పార్కింగ్ టైల్స్ అమర్చారు. వర్షా కాలం కూడా వాకింగ్ ట్రాక్‌ను వినియోగించుకునేలా తయారు చేశారు.

వ్యాయామానికి అవకాశం కల్పించారు



గతంలో వ్యాయామం చేయాలన్నా, వాకింగ్‌కు వెళ్లాలన్నా దూరం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కోనేటి ఒడ్డునే వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో మాకు చక్కని అవకాశం దొరికింది. అటు ఆహ్లాదం.. ఇటు ఆరోగ్యం .. బాగుంది.

– ఎం.వి.నాగేశ్వరరావు, వినాయనగర్ కాలనీ

మంచి రిఫ్రెష్‌మెంట్ పాయింట్



ఇప్పటి వరకు జాతీయ రహదారి, లేదా గ్రామంలోని రోడ్ల మీద వాకింగ్ చేయాల్సి వచ్చేది. మహిళలు, వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు వందలాది మంది ఉదయం వాకింగ్ కోసం పాట్లు పడాల్సి వచ్చేది. పిల్లలు సెలవుల్లో రోడ్ల మీద, ఇళ్ల మధ్యలో ఆడుకునేవారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు అందుబాటులోకి రావడంతో అందరూ ఒకచోట రిఫ్రెష్ అయ్యే అవకాశం కల్పించారు. కృతజ్ఞతలు.

– కింతాడ ఈశ్వరరావు, గంగిరెడ్ల కాలనీ

నీటి వనరుల సంరక్షణ భేష్



కొండవాలు ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు వృథా కాకుండా తీసుకున్న సంరక్షణ చర్యలు అభినందనీయం. వేసవిలో చెరువులో నీరు ఉంటే పరిసరాల్లో భూగర్భ జలాల కోసం అవస్థలు పడాల్సి ఉండదు. అందరికీ ఎంతో ఉపయోగం.

– యలమర్తి వెంకటరావు, లంకెలపాలెం

జీవీఎంసీ నిధులతో ఓపెన్ జిమ్, సులభ్ కాంప్లెక్స్



అమృత్ పథకంలో కోటి ఇరవై లక్షలతో పనులు చేపట్టగా, సులాభ్ కాంప్లెక్స్, ఓపెన్‌జిమ్‌లను నిర్మాణానికి జీవీఎంసీ నిధులు విడుదల చేశారు. జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన చొరవతో సుమారు రూ.28లక్షలతో వీటిని ఏర్పాటు చేశాం.

– రౌతు శ్రీనివాసరావు, కార్పొరేటర్

76 మందికి కంటి వైద్యపరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని వాసీవా భవనంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో పలు పరిశ్రమలకు చెందిన కార్మికులతో పాటు పలువురు పారిశ్రామిక వేత్తలకు కంటి పరీక్షలు చేశారు. 76 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి కంటి ఆపరేషన్లు, 8 మందికి కంటి అద్దాలు అవసరమయ్యాయని ఆస్పత్రి మేనేజర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం కూడా వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సమృద్ధి, డాక్టర్ హర్షిత, వాసీవా ప్రతినిధులు పాల్గొన్నారు.

'మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి'

గాజువాక : గంగవరం పోర్టు రోడ్‌లో గురువారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందిన వద్దాది మహేశ్వరరావు కుటుంబానికి న్యాయం చేయాలని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. మహేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు పోస్టుమార్టం అనంతరం డాక్టర్లు, పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. గంగవరం పోర్టు రోడ్‌లో భారీ లోడు వాహనాల వల్ల, విపరీతమైన కాలుష్యం వల్ల ఇలాంటి ప్రమాదాలు ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే విచారణ జరిపి ప్రమాదానికి కారణమైనవారిని పట్టుకోవాలని, మృతుడు మహేశ్వరరావు తల్లి నాగమణికి న్యాయం చేయాలని సౌత్ ఏసీపీ సహా, గాజువాక ట్రాఫిక్, శాంతి భద్రతల పోలీసులను కోరారు.

వేతనాల చెల్లింపుల్లో జాప్యంపై ఆందోళన



ధర్నా చేస్తున్న సిటూ నాయకులు, కార్యకర్తలు

ఉక్కునగరం: స్టీల్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ మరియు మిత్రపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం స్టీల్ ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయంలో వేతనాల కోసం ధర్నా చేశారు.

ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ కర్మాగారం కోసం కష్టపడిన ఉద్యోగులకు జీతాలు ప్రతీ నెలా 7వ తేదీన చెల్లించాలని చట్టం చెబుతోందని, కానీ యాజమాన్యం అందుకు విరుద్ధంగా గడిచిన మూడు మాసాలుగా సకాలంలో జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాల కోసం కేవలం రూ. 90 కోట్లు చెల్లించకుండా కావాలనే యాజమాన్యం కుంటిసాకులు చెబుతోందన్నారు. దీనిపై సీఎండీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. తక్షణమే జీతాలు చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోబ్తీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి, మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, డి.సురేష్‌బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

పెదగంట్యాడ: 30 ఏళ్లు దాటిన వారు విధిగా బీపీ పరీక్షలు చేయించుకోవాలని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా సూచించారు. ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం 77వ వార్డు సచివాలయం వద్ద వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, గోపాలం, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గందరగోళంగా సమావేశం

ఉక్కు కార్మికుల జీతాలపై కొరవడిన స్పష్టత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కార్మిక సంఘాలతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశం గందరగోళంగా ముగిసింది. జీతాలపై ఎటువంటి స్పష్టత రాకపోవడంతో అటు యాజమాన్యం, ఇటు కార్మిక సంఘాల తీరుపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఆధ్వర్యంలో ఈడీ (వర్క్స్) బిల్డింగ్ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో, ప్రతిపక్ష ఐఎన్‌టీయూసీతో 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఆర్ అధికారులు సమాచారం అందించారు. ఏఐటీయూసీ నాయకులు అక్కడికి చేరుకోగా డైరెక్టర్ (పర్సనల్) రావడం లేదని హెచ్‌ఆర్ అధికారులు తెలిపారు. జీతాలపై డైరెక్టర్ స్పష్టమైన హామీ ఇస్తారని భావించిన నాయకులు ఆయన రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఈలోగా ఐఎన్‌టీయూసీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే బిల్డింగ్ కింద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులు ఒకేసారి అక్కడికి చేరుకుని సాయంత్రంలోగా జీతాలు చెల్లించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హెచ్‌ఆర్ జీఎం ప్రకటన చేయడానికి ప్రయత్నించగా కార్మిక నాయకులు అంగీకరించలేదు. ఒకానొక దశలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈలోగా హెచ్‌ఆర్ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోగా, కొంతసేపటికి ఇరు కార్మిక సంఘాల నాయకులు జారుకున్నారు.

ట్రాలర్‌ను ఢీకొట్టిన ట్యాంకర్

- రోడ్డు పాలైన సిల్వర్ బ్రిక్స్ బ్యాగులు, రెడీమిక్స్ కాంక్రీట్



సిల్వర్ బ్రిక్స్ బ్యాగుల లోడుతో ఉన్న ట్రాలర్‌ను ఢీ కొట్టిన రడీ మిక్స్ కాంక్రీట్ లారీ

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద టాలర్‌ను ట్యాంకర్ ఢీకొట్టింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలివీ.. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో సిల్వర్ బ్రిక్స్ బ్యాగుల లోడుతో షీలానగర్ నుంచి ఆటోనగర్ వైపు ట్రాలర్ వస్తోంది. అదే సమయంలో ఆటోనగర్ నుంచి రెడీమిక్స్ కాంక్రీట్ లోడులో ట్యాంకర్ వస్తోంది. సరిగ్గా సిగ్నల్ పాయింట్ వద్ద ఆటోనగర్ లోపలికి వెళ్లడానికి ట్రాలర్ మలుపు తిరుగుతుండగా.. ట్యాంకర్ ట్రాలర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రాలర్ రోడ్డు పక్కనున్న డివైడర్‌పైకి దూసుకుపోయింది. రోడ్డుపై సిల్వర్ బ్రిక్స్ బ్యాగులు చిందరవందరగా పడిపోగా, కాంక్రీట్ రోడ్డు పాలైంది. సమాచారం అందుకున్న గాజువాక సీఐ కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాలకు కారణమైన రెండు భారీ వాహనాలను క్రేన్‌ల సహాయంతో గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జరిగిన ప్రమాదంలో ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం కానీ, గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద కారణంగా రోడ్డుపై పడిన సామగ్రిని తొలగించారు. సాయంత్రం వరకు గాజువాక నుంచి షీలానగర్ వైపు వచ్చే వాహనచోదకులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

వెంకటాద్రిపై ఘనంగా ధ్వజారోహణ



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



ధ్వజారోహణలో పాల్గొన్న భక్తులు

- రెండో రోజు వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ధ్వజారోహణ, హోమాలు జరిపారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.

అవధుల్లేని ఆనందం

వేసవి సెలవులు వస్తే పిల్లల ఆనందానికి అవధులు ఉండవు. సంవత్సరం మొత్తం స్కూల్స్, హోమ్ వర్క్స్, కోచింగ్‌లంటూ పరుగులు పెట్టే చిన్నారులకు 'ఆట'విడుపు సమయమిది. ఆహ్లాదకర వాతావరణంలో క్రీడాపరికరాలు అందుబాటులో కనిపించడంతో టీవీ, మొబైల్ ఫోన్లకు బైబై చెప్పేసి ఆటల్లో నిమగ్నమయ్యారు. జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం రావులచెరువును ఆనుకొని ఉన్న ఓపెన్ జిమ్, బాలల ఆటల వేదిక సాయంత్రం వేళల్లో పిల్లల ఆటపాటలతో సందడిగా ఇలా దర్శనమిస్తోంది. వారి ఉల్లాసానికి ఆకాశమే హద్దయింది.

– అగనంపూడి





పిల్లలతో సందడిగా పార్కు





ఇల్లు కడదామా.. ఇసుకలో ఆడుతున్న చిన్నారులు





ఆటల్లో లీనమైన చిన్నారులు

ఏయూను సందర్శించిన అమెరికా ఆచార్యుడు



వీసీ ప్రసాదరెడ్డితో భేటీ అయిన అమెరికా ఆచార్యుడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీ ఇండియానా పోలీస్‌కు చెందిన డాక్టర్ మంగిలాల్ అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లతో సమావేశమయ్యారు. బోధన, పరిశోధన భాగస్వామ్యం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనే భావించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ ప్రోగ్రాం, ఆన్‌లైన్ కోర్సులను ఏయూ సిబ్‌తో పాటు ఇతర విభాగాలతో సంయుక్తంగా నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు జి.గిరిజా శంకర్, కె.ఈశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన: కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.